క్లుప్తంగా

'శంఖనాదం'ను విజయవంతం చేయాలి

ఒంగోలు సెంట్రల్: బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన శంఖనాదం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వక్తలు కోరారు. ఒంగోలు విష్ణుప్రియ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం బీజేపీ సోషల్ మీడియా వర్క్‌షాప్ నిర్వహించారు. సౌత్ ఇండియా ఎస్టీ మోర్చా సోషల్ మీడియా ఇన్‌చార్జి పెద్దన్నరావునాయక్ పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉన్న పలువురిని సన్మానించారు. ఇటీవల మృతిచెందిన ఒంగోలు సోషల్ మీడియా కన్వీనర్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో అధికార ప్రతినిధి లంకా దినకర్, జిల్లా ఇన్‌చార్జి రవిశంకర్, ఒంగోలు పార్లమెంట్ కన్వీనర్ సెగ్గం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి శివాజీ యాదవ్, కార్యదర్శి రాజశేఖర్, ఐటీ, మీడియా కన్వీనర్లు పాల్గొన్నారు.

పాదయాత్రను విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చీమకుర్తి: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందా కృష్ణమాదిగ చేపట్టనున్న పాదయాత్రను జయప్రదం చేయాలని చీమకుర్తి మండల అధ్యక్షుడు పాటిబండ్ల జక్రయ్య కోరారు. పాదయాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్లను శుక్రవారం చీమకుర్తిలో నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ నెల 7న అలంపూర్ నుంచి ప్రారంభమై నవంబర్ 4 నాటికి హైదరాబాద్ చేరుకునే పాదయాత్రను జయప్రదం చేయాలని కోరారు.

డైట్ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

చీమకుర్తి: దర్శిలోని ప్రైవేటు డైట్ కాలేజీ అయిన రిషూన్స్ కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో మేనేజ్‌మెంట్ సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మైనంపాడు ప్రభుత్వ డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీసెట్ 2023లో అర్హత పొందిన వారు మాత్రమే ఈ నెల 14లోపు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

నాటు సారా నిందితుడికి జైలు శిక్ష

దర్శి: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నాటు సారా తయారు చేసి విక్రయాలకు పాల్పడుతూ సెబ్ పోలీసులకు పట్టుబడ్డ నిందితుడికి శుక్రవారం దర్శి జె.ఎఫ్.సి.ఎం కోర్టు శిక్ష విధించినట్లు సెబ్ ఇన్‌స్పెక్టర్ బి. సుందరరామయ్య తెలిపారు. తాళ్లూరు మండలం తూర్పు గంగవరం గ్రామానికి చెందిన నాగులూరి శ్రీను కు న్యాయమూర్తి శిక్షను ఖరారు చేశారు.

ఏపీజీబీలో రూ.44 వేల కోట్లతో లావాదేవీలు

మార్కాపురం: కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని చైర్మన్ రాకేష్ కశ్యప్ పేర్కొన్నారు. 10 జిల్లాల్లో 551 శాఖల నుంచి రూ.44 వేల కోట్లతో వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. శుక్రవారం స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో లబ్ధిదారులకు రూ.6.68 కోట్ల రుణాలు పంపిణీ చేశారు. వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహిస్తూనే ఇతర రంగాల్లో వారికి కూడా రుణాలు అందిస్తున్నామన్నారు. డ్వాక్రా మహిళలకు పంట రుణాలు కూడా అందిస్తున్నామన్నారు. గతంలో వ్యక్తిగత రుణం రూ.2 లక్షలు మాత్రమే ఇచ్చామని, వ్యాపార లావాదేవీలను పరిశీలించి రూ.50 లక్షల వరకు ఇస్తున్నట్లు చెప్పారు. ఖాతాదారుల పిల్లల విద్యాభివృద్ధికి రూ.7.50 లక్షల వరకు హామీ లేకుండానే విద్యా రుణం ఇస్తున్నట్లు తెలిపారు రీజినల్ మేనేజర్ ఇ. శ్రీనివాసప్రసాద్, బ్రాంచ్ మేనేజర్లు ప్రసాద్, సురేష్‌కుమార్‌రెడ్డి, రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై కృత్రిమ గర్భధారణ వీర్య నాళికలు

పొదిలి: స్థానిక పశు వైద్యశాలలో శుక్రవారం పెయ్యదూడల ఉత్పత్తి పథకంపై పశుపోషకులకు అవగాహన కల్పించారు. డీఎల్‌డీఏ ఈఓ డాక్టర్ కాలేషా, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ.. కృత్రిమ గర్భధారణకు అవసరమైన లింగ నిర్ధారణ వీర్యాన్ని రెండు పర్యాయాలు గర్భధారణ చేసేందుకు రూ.675 విలువగల కిట్లను సబ్సిడీపై అందజేస్తున్నట్లు తెలిపారు. రెండు వీర్య నాళికల ధర రూ.1350 కాగా, సబ్సిడీపై రైతులకు రూ.500కే ప్రభుత్వం అందిస్తోందన్నారు. పశుపోషకులు, రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏడీ డాక్టర్ వేణు, డాక్టర్లు మణిశేఖర్, పొదిలి, మర్రిపూడి, కొనకనమిట్ల మండలాల పశు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఉరుసు మహోత్సవం

కొమరోలు: మండలంలోని రాజుపాలెంలో శుక్రవారం హజరత్ సయ్యద్ ఖాజా మొహిద్దీన్ స్వామి ఉరుసు మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు దర్గాలో స్వాముల వారికి ప్రార్థనలు చేశారు. ఉరుసు మహోత్సవంలో గిద్దలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు, మనోజ్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కామూరి రమణరెడ్డి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ప్రజలందరి ఆరోగ్యమే జగనన్న లక్ష్యం

- సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు



గార్లపాడులో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, పాల్గొన్న అధికారులు, నాయకులు

మద్దిపాడు: రాష్ట్రంలోని ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు ఏర్పాటు చేశారని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు తెలిపారు. మండలంలోని గార్లపాడు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రజల ఆరోగ్యం గురించి పట్టించుకుని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్య శ్రీ పథకాన్ని తీసుకొస్తే.. ఆయన కుమారుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో రెండడుగులు ముందుకేసి ఆరోగ్య శ్రీని విస్తరించడమే కాకుండా ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌తో ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి డాక్టర్ వెళ్లి మంచంలో ఉన్న రోగలను కూడా పరీక్షించి మందులిచ్చే విధంగా చర్యలు తీసుసుకుంటున్నారని వివరించారు. అంతేగాకుండా రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ క్యాంప్‌లు నిర్వహిస్తూ ఆస్పత్రులకు రాలేని రోగులకు గ్రామాల్లోనే స్పెషలిస్టు డాక్టర్లతో మెగా మెడికల్ క్యాంపులు నిర్వహిస్తూ ప్రజల ఆరోగ్యమే తనకు ముఖ్యమని నిరూపిస్తున్నారన్నారు. ప్రజలకు ఏ విధంగా మేలు చేయవచ్చని మాత్రమే సీఎం ఆలోచిస్తారని, అటువంటి వ్యక్తిని మరోమారు రాష్ట్రానికి ముఖ్యమంత్రిని చేసుకుందామని కోరారు. సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి వలంటీర్ల ద్వారా పెన్షన్లు, పథకాల లబ్ధిదారులను గుర్తించి అర్హులందరికీ కుల, మత, ప్రాంత, పార్టీ విభేదాలు లేకుండా పథకాలు వర్తింపజేశారని తెలిపారు. ప్రతి గడపలో ఆయన అందించిన పథకాలు ఉన్నాయన్నారు. ప్రజలకు మంచి చేసే నాయకుడిని ప్రతిఒక్కరూ ఆదరించాల్సిన బాధ్యత ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించి మరోమారు ముఖ్యమంత్రిని చేసుకుందామని కోరారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మొత్తం 245 మంది రోగులను పరీక్షించి ఎమ్మెల్యే చేతుల మీదుగా రోగులకు మందులు పంపిణీ చేయించారు. కార్యక్రమంలో ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకట్రావు, గ్రామ సర్పంచ్ గంగిరెడ్డి, ఎంపీటీసీ పైనం ప్రభాకర్, ప్రసన్నాంజనేయరెడ్డి, చిరంజీవి, నారా సుబ్బారెడ్డి, అవినాష్, రామాంజనేయులు, స్పెషల్ ఆఫీసర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, డీటీ జ్యోతి, స్పెషలిస్టు డాక్టర్లు, పిల్లల వైద్యనిపుణులు డేవిడ్ విలియమ్స్, స్త్రీ వైద్యనిపుణులు తేజశ్విని, డాక్టర్లు ఆనంద మోహన్, శ్రావణ్, జగదీష్, వినీల చౌదరి, ప్రజలు పాల్గొన్నారు.

గురవారెడ్డిపాలెంలో...

చీమకుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పేద ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ ఉందని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. శుక్రవారం సంతనూతలపాడు మండలం గురవారెడ్డిపాలెంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా సంపూర్ణమైన ఆరోగ్యంతో ఉండాలనే ఉద్దేశంతోనే తొలుత గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్, ఇప్పుడు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను సీఎం అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్యపరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు తీసుకోవాలన్నారు. వైద్యపరీక్షల అనంతరం రోగులను పరామర్శించి ఎమ్మెల్యే చేతుల మీదుగా మందులు పంపిణీ చేశారు. వైద్యశిబిరాన్ని జిల్లా స్పెషలాఫీసర్ టీ ఉషారాణి, డీఎంహెచ్ఓ రాజ్యలక్ష్మి, డిప్యూటీ డీఎంహెచ్ఓ మాధవీలత సందర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, స్థానిక సర్పంచ్ మారెడ్డి విజయలక్ష్మి, ఎంపీటీసీ కంచి మాధవి, వైఎస్సార్ సీపీ గ్రామ నాయకులు పాల్గొన్నారు.



గురవారెడ్డిపాలెంలో రోగులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

చదలవాడలో...

నాగులుప్పలపాడు: మండలంలోని చదలవాడ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు పరిశీలించారు. ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, పార్టీ మండల అధ్యక్షుడు పోలవరపు శ్రీమన్నారాయణ, కుమ్మారి సుధాకర్, ఉప సర్పంచ్ కోడె సుబ్బారావు, రామస్వామి, తహసీల్దార్ సుజన్‌కుమార్, ఎంపీడీవో జయమణి పాల్గొన్నారు.



కరవదిలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ

కరవదిలో...

ఒంగోలు రూరల్: మండలంలోని కరవది సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతమైంది. వైద్య శిబిరంలో భాగంగా ఏర్పాటు చేసిన కార్డియాలజీ విభాగాన్ని కరవది సర్పంచ్ డి.కోటేశ్వరరావు ప్రారంభించగా, గైనిక్ విభాగాన్ని కరవది ఎంపీటీసీ మన్నె శ్రీనివాసరావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఏర్పాట్లను కరవది పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సుందర్‌ప్రసాద్, గ్రామ కార్యదర్శులు నాగేంద్రకుమార్, వేమా శ్రీలక్ష్మి పర్యవేక్షించారు. మొత్తం 430 మందికి హృద్రోగ, గైనకాలజీ, జనరల్ మెడిసన్ విభాగాల్లో పరీక్షలు చేసి వైద్య సేవలు అందించారు. సమస్య తీవ్రతను మేరకు కొందరిని ఒంగోలు రిమ్స్‌కు సిఫార్సు చేశారు. మధ్యాహ్నం రాష్ట్ర ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ డాక్టర్ యాదాల అశోక్ బాబు సందర్శించి నిర్వాహకులైన ఎంపీడీవో పి.అజిత, ఈవోఆర్డీ మారెడ్డి రమణమ్మ, మెడికల్ ఆఫీసర్ సుందర్‌ప్రసాద్‌తో మాట్లాడారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం ఆర్‌బీఎస్‌కే కో ఆర్డినేటర్ డాక్టర్ భగీరథ ఆకస్మికంగా సందర్శించి మాట్లాడారు. వైద్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు ఒంగోలు ఎంపీడీవో, మెడికల్ ఆఫీసర్, వైద్యులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ఆశాలను అభినందించి సర్పంచ్, ఎంపీటీసీని ఘనంగా సత్కరించారు. ఉత్తమ సేవలందించిన కరవది ఏఎన్ఎంలను యాదాల అశోక్ బాబు సన్మానించారు. పలువురికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు.



కరవదిలో కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న ఆరోగ్యశ్రీ రాష్ట్ర కో ఆర్డినేటర్ యాదాల అశోక్‌బాబు, అధికారులు, ప్రజాప్రతినిధులు

అద్దె బకాయిలు వెంటనే చెల్లించాలి

- నగర కమిషనర్ వెంకటేశ్వరరావు



31వ డివిజన్ సచివాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: నగరంలోని కొత్త కూరగాయల మార్కెట్‌లో షాపుల లీజుదారులు అద్దె బకాయిలు వెంటనే చెల్లించాలని కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. ఒంగోలు నగరపాలక సంస్థ రెవెన్యూ అధికారులు, సిబ్బందితో కలిసి శుక్రవారం కొత్త కూరగాయల మార్కెట్‌ను ఆయన సందర్శించారు. షాపుల లీజుదారులతో స్వయంగా మాట్లాడి మార్కెట్లో అద్దె బకాయిలు వసూలు చేసే కౌంటర్‌ను పరిశీలించారు. మార్కెట్‌లో పర్యటించి షాపుల యజమానులు ఇప్పటికిప్పుడు కట్టాల్సిన అద్దె బకాయిల జాబితా చదివి వినిపించారు. ప్రస్తుతం అద్దె బకాయిలు కనీసం 50 శాతం ఇప్పటికిప్పుడు చెల్లించాలని ఆదేశించారు.

విజయనగర్ కాలనీ వార్డు సచివాలయం తనిఖీ...

స్థానిక 31వ డివిజన్‌లోని విజయనగర్‌కాలనీ వార్డు సచివాలయాన్ని కమిషనర్ తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్, మూవ్‌మెంట్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. సిబ్బంది ఏకరూపు దుస్తులు తప్పనిసరిగా ధరించాలని ఆదేశించారు. స్పందనలో వచ్చిన అర్జీల రికార్డులు తెప్పించుకున్న కమిషనర్.. స్వయంగా బాధితులకు ఫోన్ చేసి సమస్య పరిష్కారం అయిందా.. లేదా అని వాకబు చేశారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ తన్నీరు నాగజ్యోతి నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

3వ శానిటరీ డివిజన్ మస్టర్ పరిశీలన...

నగరంలోని మూడవ శానిటరీ డివిజన్‌ను శుక్రవారం తెల్లవారుజామున కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మస్టర్ పరిశీలించారు. ప్రతి ఒక్క పారిశుధ్య కార్మికుడు సమయానికి హాజరుకావాలని, ఏ ఒక్కరికీ మినహాయింపు లేదని స్పష్టం చేశారు. అనంతరం వెంగముక్కలపాలెంలో పారిశుధ్య పనులను కమిషనర్ పరిశీలించి సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు.

నియామక పత్రాలు అందించిన ఎమ్మెల్యే టీజేఆర్



ఎమ్మెల్యే చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్న అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు

మద్దిపాడు: మండలంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఒక అంగన్‌వాడీ వర్కర్, ఒక మినీ సెంటర్ వర్కర్, ఆయాలు పది మందికి సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు చేతుల మీదుగా శుక్రవారం ఉదయం నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్నారులకు చక్కగా సేవలందించాలని కోరారు. ప్రస్తుతం అంగన్‌వాడీ సెంటర్లను కూడా రాష్ట్ర ప్రభుత్వం ఆధునికీకరిస్తున్న నేపథ్యంలో చిన్నారులకు మంచి పౌష్టికాహారం అందిస్తూ వారికి ప్రీస్కూల్‌కు సంబంధించిన చదువు అందించాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ ఇవాంజలిన్, ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, మల్లవరం సర్పంచ్ నారా సుబ్బారెడ్డి, ఎంపీటీసీ పైనం ప్రభాకర్, తేళ్ల పుల్లారావు, దుడ్డు వినోద్, సూపర్‌వైజర్లు పద్మావతి, జయలక్ష్మి, నియామక ఉత్తర్వులు పొందిన అభ్యర్థులు పాల్గొన్నారు.

నేడు ఒంగోలులో పలు అభివృద్ధి పనుల ప్రారంభం

- ప్రారంభించనున్న ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని

ఒంగోలు సబర్బన్:ఒంగోలు నగరంలో పూర్తయిన పలు అభివృద్ధి పనులను శనివారం స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రారంభించనున్నారు. నగర అభివృద్ధిలో భాగంగా చేపట్టి పూర్తయిన వివిధ పనులను ప్రజలకు అంకితం చేయనున్నారు. ఆ వివరాలను కమిషనర్ వెంకటేశ్వరరావు శుక్రవారం రాత్రి మీడియాకు వెల్లడించారు. ఉదయం 8 గంటల నుంచి ప్రారంభోత్సవ కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. ఒకేరోజు రూ.3,45,60,000 విలువ గల అభివృద్ధి పనులను ఎమ్మెల్యే బాలినేని ప్రారంభిస్తారన్నారు. నగర పరిధిలోని 18వ డివిజన్ కొత్తమామిడిపాలెంలో రూ.1.20 కోట్లతో నిర్మించిన గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను బాలినేని ప్రారంభిస్తారు. అనంతరం 17వ డివిజన్‌లోని పోస్టల్ కాలనీలో రూ.20 లక్షలతో నిర్మించిన పశు సంరక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తారు. తర్వాత దక్షిణ బైపాస్‌లో 19వ డివిజన్‌లో రూ.15.60 లక్షలతో నిర్మించిన కాసు బ్రహ్మానంద రెడ్డి విగ్రహం చుట్టూ నిర్మాణం పూర్తి చేసుకున్న పార్కును ప్రారంభిస్తారు. 9వ డివిజన్ రాజీవ్ గృహకల్ప 6వ లైన్‌లో రూ.40 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభిస్తారు. 9వ డివిజన్ పరిధిలోనే రూ.1.50 కోట్ల వ్యయ అంచనాలతో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఎమ్మెల్యే బాలినేని ప్రారంభిస్తారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొనాలని కమిషనర్ కోరారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి

ఒంగోలు సెంట్రల్: ఉద్యానవనశాఖ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యానవన శాఖాధికారి వై.గోపీచంద్ సూచించారు. ఒంగోలు ప్రాంతీయ ఉద్యానవన శిక్షణ సంస్థలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ సమీకృత సాగు నీరు, వ్యవసాయ పరవర్తన పథకం ఆధ్వర్యంలో బత్తాయి, నిమ్మ సాగు చేసే వ్యవసాయ సంఘాల రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ విజయభాస్కర్ మాట్లాడుతూ బత్తాయి, నిమ్మతోటలు కాయ పెరిగే దశలో ఉన్నాయని తెలిపారు. రసం పీల్చే పురుగులు రాత్రివేళల్లో ఆశిస్తాయని చెప్పారు. సమగ్ర సస్యరక్షణ చర్యల్లో భాగంగా కిమ్మ కత్తిరింపులు, కాయ నాణ్యతను దెబ్బతీసే త్రిప్స్, మంగు నల్లి నుంచి పంటను రక్షించుకోవాలని చెప్పారు. నివారణకు లీటరు నీటికి 1.6 మి.లీ మోనోక్రోటోపాస్, 1.5 గ్రాముల థయోవిట్‌ను కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. వారం రోజుల తర్వాత లీటరు నీటికి 2.0 మి.లీ ఒమైట్ కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఏపీ మైక్రోఇరిగేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ పీవీ రమణ మాట్లాడుతూ ప్రతి రైతు డ్రిప్ పద్ధతి ద్వారా నీటిని, రసాయనిక ఎరువులను వాడటం ద్వారా నీటి ఆదా, రసాయన ఎరువుల ఆదా పాటించవచ్చని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను వివరించారు. బొప్పాయి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రాంతీయ ఉద్యానవన శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ ఎం.శ్రీలక్ష్మి మాట్లాడుతూ బత్తాయి, నిమ్మ సాగు రైతులకు నీటి కుంటలు ఏర్పాటు చేసుకోవడం వలన కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. దర్శి ఉద్యానవన శాఖాధికారి రవి వెంకన్నబాబు మాట్లాడుతూ నాణ్యమైన కొబ్బరి, మామిడి, నిమ్మ మొక్కలు ఉద్యానవన నర్సరీలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. డిపార్ట్‌మెంటు నిర్ణయించిన ధరలకే రైతులకు అందిస్తున్నట్లు చెప్పారు. కంభం, అర్ధవీడు, బేస్తవారిపేట, తాళ్లూరు మండలాల ఎఫ్‌టీఓలు, రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉద్యానవన శాఖాధికారి గోపీచంద్

విచక్షణా రహితంగా పురుగుమందులు వాడొద్దు



కంది పంటలో సస్యరక్షణ గురించి వివరిస్తున్న ఆత్మ పీడీ అన్నపూర్ణ

ఒంగోలు సెంట్రల్: రైతులు విచక్షణా రహితంగా పురుగు మందులు వాడి అదనపు భారాన్ని పెంచుకుని నష్టపోవద్దని ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా వనరుల కేంద్రం సమన్వయకర్త అన్నపూర్ణ సూచించారు. జిల్లాలోని నర్సాయపాలెం, కాశికొండ, పీఠర్‌సీ తండాలలో శుక్రవారం క్షేత్రస్థాయి పర్యటన చేశారు. పత్తి, మిరప, కంది, వరి, ఆముదం పంటలను పరిశీలించి వాటిని ఆశించే పురుగుల జీవిత చరిత్రను వివరించారు. వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించి అవసరమైన పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. సేంద్రియ, జీవన ఎరువుల విధానాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. తండా రైతులకు తక్కువ ధరలకు వాటిని అందించారు. ఆయా కార్యక్రమాలలో ఆత్మ ఏవోలు శేషమ్మ, శైలజ, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి



తొట్లను శుభ్రం చేయిస్తున్న ఎంపీడీవో సుజాత, ఈవోఆర్డీ బాలచెన్నయ్య

మదనూరు (కొత్తపట్నం): వర్షాకాలం కావడంతో విషజ్వరాలు వస్తున్నాయని, వాటిని నివారించేందుకు గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు, సచివాలయ సిబ్బందిని ఎంపీడీవో సుజాత ఆదేశించారు. మదనూరు గ్రామ సచివాలయం-1 పరిధిలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించి గృహాలను సందర్శించారు. నీటి నిల్వలను తొలగించి సామగ్రిని శుభ్రం చేయించారు. అలా చేయకుంటే దోమల లార్వాలు ఉత్పత్తి అయి దోమలు పెరిగి సీజనల్ వ్యాధులు వస్తాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ ఏ బాలచెన్నయ్య, ఈతముక్కల హాస్పిటల్ డాక్టర్ శివపార్వతి, వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి ఉమామహేశ్వరి, ఆశాలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి



పొలాన్ని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

గిద్దలూరు రూరల్: ప్రజల నుంచి వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించే దిశగా పనిచేయాలని జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్పందనంలో వస్తున్న అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ప్రజల నుంచి వచ్చే అర్జీలను బాధ్యతగా స్వీకరించి వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రయత్నించాలన్నారు. ప్రభుత్వం కొత్తగా అసైన్డ్‌మెంట్ పొలాలకు రిజిస్టర్ హక్కు కల్పించేందుకు తీసుకున్న నిర్ణయానికి గిద్దలూరు మండలంలో 8 గ్రామాలను గుర్తించారు. ఆయా గ్రామాలకు సంబంధించిన 134 మంది రైతులకు చెందిన అసైన్డ్‌మెంట్ పొలాల రికార్డులను జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డుల పనితీరు సక్రమంగా నిర్వహించిన తహశీల్దార్ డి.సీతారామయ్యను ప్రశంసించారు. ఆయన వెంట మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్ ఉన్నారు.

అసైన్‌మెంట్ భూములను తనిఖీ చేసిన జేసీ



రికార్డులు పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

బేస్తవారిపేట: మండలంలోని డీకే పురంలో 2003 సంవత్సరంలోపు అసైన్‌మెంట్ పట్టాలు పొంది, పట్టాలు పొందిన వారే సాగులో ఉన్నారా లేదా అని జాయంట్ కలెక్టర్ శ్రీనివాసరావు, మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్‌లు శుక్రవారం తనిఖీ చేశారు. రెవెన్యూ అధికారులు లబ్ధిదారులను ఎంపిక చేసిన జాబితాను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి సాగు చేస్తున్న వారి వివరాలు సేకరించారు. తహసీల్దార్ డీవీబీ వరకుమార్, వీఆర్వో పాల్గొన్నారు.

అనాథలకు భోజనాల పంపిణీ

కొత్తపట్నం: భిక్షాటన చేసే అనాథలు, వికలాంగులు, వృద్ధులకు మదర్ థెరిసా హెల్పింగ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. అల్లూరు ఎంపీటీసీ శాంతారావు, విజయ దంపతుల కుమార్తె విద్యారణ్య పుట్టినరోజు సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అగ్నిమాపక శాఖ కార్యాలయం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న అగ్నిమాపకశాఖ జిల్లా అధికారి

గిద్దలూరు రూరల్: స్థానిక అగ్నిమాపక శాఖ కార్యాలయాన్ని అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. సిబ్బంది వివరాలు, వారికి సంబంధించిన పనిదినాల రిజిస్టర్లను తనిఖీ చేశారు. ప్రజల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌పై సత్వరమే స్పందించాలని సూచించారు.

పోలీస్‌స్టేషన్ ముందు తల్లిదండ్రుల ఆందోళన

మార్కాపురం: తేలుకాటుతో తమ కుమారుడు మృతి చెందడానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మార్కాపురం మండలం నాయుడుపల్లి గ్రామానికి చెందిన రవికిరణ్ తల్లిదండ్రులు, బంధువులు శుక్రవారం సాయంత్రం పట్టణ పోలీస్‌స్టేషన్, సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేశారు. ఈ సంఘటనకు పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులే కారణమని వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనకారులతో సీఐ భీమా నాయక్, ఎస్సైలు కోటేశ్వరరావు, వెంకటేశ్వరనాయక్ మాట్లాడుతూ.. లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.